క్లుప్తంగా

కోటి సంతకాల సేకరణలో పాల్గొనండి

అమరావతి: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు కోరారు. శుక్రవారం ఆయన కార్యక్రమ వివరాలను తెలియజేస్తూ ఈ నెల 19వ తేదీ ఆదివారం స్థానిక గంటలమ్మ చెట్టు వద్ద నిర్వహిస్తున్నామని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, పార్టీ నేతలు పాల్గొంటారని పేర్కొన్నారు.

మహిళల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి



నకరికల్లు: గ్రామాభివృద్ధిలో స్వయం సహాయక సంఘాల మహిళల భాగస్వామ్యం అవసరమని ఎంపీడీఓ జి.కాశయ్య అన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్వయం సంఘాల మహిళలకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిగ్రామానికి కొందరిని గుర్తించి క్లీన్ అండ్‌గ్రీన్, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛరథం ప్రాధాన్యంపై అవగాహన కల్పించామన్నారు. మాస్టర్ ట్రైనీగా నర్రా మమత వ్యవహరించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీఓ కె.వి.శివప్రసాద్, ఏఓ సురేష్, ఏకేపీ సీసీ కనకారావు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, స్వయం సహాయ సంఘాల మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు సత్ఫలితాలు సాధించడానికి కృషి



క్రోసూరు: విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, వారిలో సామర్థ్యాలను బాగా మెరుగుపరచాలని ఎంపీడీఓ జి.రవికుమార్ కోరారు. శుక్రవారం కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశాల మేరకు క్రోసూరులోని కస్తూరిబా బాలికల పాఠశాల, ఆదర్శపాఠశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని రికార్డులు, హాజరు పట్టీలు పరిశీలించారు. మధ్యాహ్న భోజనాలు, తాగునీటి ప్లాంట్ల పనితీరు పరిశీలించారు. ఆయన వెంట డెప్యూటీ ఎంపీడీఓ జి.శ్రీనివాస్, ఎంఈఓలు జి.కృష్ణ,ఎం.గణేష్, ఆయా పాఠశాలల ప్రిన్స్‌పాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సీజేఐ' ఘటనపై స్వతంత్ర దర్యాప్తు చేయండి



పెదకూరపాడు: సీజేఐపై జరిగిన దాడి ఘటనపై స్వతంత్ర దర్యాప్తు చేయాలని ఎమ్మార్పీఎస్ నేత కంచర్ల జాన్‌బాబుమాదిగ కోరారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సీజేఐ గవాయిపై జరిగిన దాడి ఘటనపై తహసీల్దార్ ధనలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ దాడి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. దాడి వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి వారికి శిక్ష పడేలా స్వతంత్ర దర్యాప్తు చేయించాలన్నారు. సీనియర్ జడ్జిలతో విచారణ చేయించాలని. ఇలాంటివి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు కిశోర్‌కుమార్, ఏసోబు, చక్రవర్తి, నాగరాజు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు

ముప్పాళ్ళలో..

ముప్పాళ్ళ: సీజేఐ గవాయిపై దాడి అమానుషమైన చర్య అని ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి కొడవటి అశోక్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ ఆదేశాల మేర శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ కందుల అంబేడ్కర్‌బాబు, దొప్పలపూడి రవికుమార్, గద్దల చినరామయ్య తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దు

పిడుగురాళ్ల: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని లేని పక్షంలో అపరాధ రుసుం తప్పదని ఎస్సై మోహన్ తెలిపారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో శుక్రవారం రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మోహన్ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, త్రిబుల్ రైడింగ్ ప్రమాదకరమని అలా చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాంతకం అని ప్రతి ఒక్కరూ ధరించాలన్నారు.

పేదల ఆరోగ్యంపై చంద్రబాబు నిర్లక్ష్యం

- ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకుందాం
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి



కోటి సంతకాల సేకరణలో సంతకం చేసిన కాపీ అందుకుంటున్న గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి

సత్తెనపల్లి: పేదల ఆరోగ్యం, పేద విద్యార్థుల ఉన్నత చదువులపై సీఎం చంద్రబాబు నిర్లక్ష్యం వహిస్తున్నారని, అందుకే ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజా మద్దతు కోరుతూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం పట్టణంలోని 12వ సచివాలయ పరిధిలో.. 19, 20 వార్డుల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌భార్గవరెడ్డి మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన 16 మాసాల్లో సుమారు రూ. 2 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. వాటిలో ఒక శాతం నిధులను ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు ఖర్చు చేసి ఉంటే వాటి నిర్మాణం పూర్తై రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి వచ్చేవన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణం ప్రారంభించారని, వాటిలో ఏడు కళాశాలలు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దాదాపు పూర్తి చేశారన్నారు. 2023- 24 లోనే ఐదు కళాశాలలో తరగతులు కూడా ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించడానికి కుట్ర పన్నుతోందని ఆయన మండిపడ్డారు.

పేదలను పట్టించుకోని కూటమి

డబ్బులు ఎలా దండుకోవాలో కూటమి నాయకులు ఆలోచిస్తున్నారని, పేద ప్రజల గురించి పట్టించుకోవడం లేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేట్‌కు ఇచ్చిన మెడికల్ కళాశాలలను ప్రభుత్వం తీసుకుంటుందని, అందరికీ విద్యా, వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో నేతలు చలంచర్ల సాంబశివరావు, షేక్ జాని (గుంటూరు జాని), షేక్ మహబూబ్ హుస్సేన్, కుకుట్ల లక్ష్మి, అచ్యుత శివప్రసాద్, సయ్యద్ గోరా, షేక్ జలీల్, గుజ్జర్లపూడి సతీష్, గడ్డం వెంకటేశ్వర్లు, బండి మల్లికార్జునరెడ్డి, కోడిరెక్క దేవదాస్, యాసారపు బాబు, శివాపురం రామారావు, కొణతం స్వాతి, హేమలత, పద్మ, వల్లెం నరసింహరావు, తుమ్మల వెంకటేశ్వరరావు, సిరిగిరి వెంకట్రావు, చేవూరు మధు, వేముల శ్రీదేవి, షేక్‌రియాజ్, కొమ్మారెడ్డి సాయి, యాసారపు బుజ్జి, చిలుకా రమణయ్య, గుజ్జర్లపూడి కృపావరం, పోపూరి కృష్ణ, పార్టీ నాయకులు,పాత్తూరు రామకోటయ్య, గురజాల శ్రీను, ఇ.ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

ప్రజావ్యతిరేక పాలనపై పోరాడుదాం!

అచ్చంపేట: రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలనపై పోరాడుదామని జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. అచ్చంపేటలో శుక్రవారం రాత్రి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి సంతకాలు సేకరించారు. నిరుపేదలు కూడా డాక్టర్లు కావాలన్న లక్ష్యంతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలకు అంకురార్పణ చేశారన్నారు. అందులో ఐదు కళాశాలలను పూర్తి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం పేదలపై కుట్రలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, వ్యవసాయ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, టౌన్‌పార్టీ కన్వీనర్ షేక్ సైదావలి, మాజీ సర్పంచ్‌లు కంబాల వీరబాబు, టీవీఎస్ మల్లికార్జునరావు, సొసైటీ మాజీ చైర్మన్ రామిశెట్టి రంగయ్య, మైనార్టీ సెల్ కన్వీనర్ షేక్ బీరువాల జాని, సామాజిక వేత్త షేక్ కమల్ సైదా, జిల్లా పార్టీ సభ్యులు కొమరాల రమేష్, సందెపోగు పున్నారావు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



కోటి సంతకాల సేకరణలో సంతకం చేస్తున్న మహిళ



అచ్చంపేటలో కోటి సంతకాల సేకరణ పోస్టర్స్ విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బార్ కోడ్ స్కాన్ తర్వాతే మద్యం విక్రయం



సత్తెనపల్లి: మద్యం సీసాలను ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌లో బార్ కోడ్ స్కాన్ చేసిన తర్వాతే వినియోగదారులకు విక్రయించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.విజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని 6 మద్యం దుకాణాలను, 5 బార్ అండ్ రెస్టారెంట్లను శుక్రవారం ఆయన సందర్శించారు. మద్యం దుకాణాల యజమానులకు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మద్యం సీసాలను యాప్ బార్‌కోడ్‌తో స్కాన్ చేయడం ఎలా? అనేది ప్రదర్శించి దుకాణాల యజమానులకు వివరించారు. ఈ యాప్ ద్వారా మద్యం సీసాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే మద్యం సీసాకు సంబంధించిన కంపెనీ వివరాలు వస్తాయని తెలిపారు. అలా రానట్లయితే కల్తీ మద్యంగా నిర్ధారిస్తారన్నారు. వినియోగదారుడు మద్యం సీసాపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఉత్పత్తి నిజమైనదేనా అని తెలుసుకోవచ్చని సూచించారు. నకిలీ మద్యం, చట్టవిరుద్ధమైన బెల్ట్ షాపుల నివారణకు ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. అనుమానాస్పద లావాదేవీలు గమనిస్తే ఫిర్యాదు చేయవచ్చన్నారు. మద్యం బాటిల్‌ను స్కాన్ చేసి ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు. స్కాన్ చేయకుండా అమ్మకాలు జరిపినా, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించినా, బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఒక వ్యక్తికి మూడు కంటే ఎక్కువ మద్యం సీసాలను విక్రయించవద్దన్నారు. షాపుల్లో మద్యం విక్రయాల రికార్డులను తనిఖీ చేశారు. ఆయనతోపాటు సిబ్బంది ఉన్నారు.

అక్రమ కేసులు పెట్టడం సరికాదు

- అక్కసుతోనే 'సాక్షి' ఎడిటర్ ధనంజయ రెడ్డి, జర్నలిస్టులపై కేసులు
- సత్తెనపల్లి ఆర్డీఓ రమణాకాంతరెడ్డికి వినతిపత్రం అందించిన జర్నలిస్టులు



ఆర్డీఓ కార్యాలయం ఎదుట నినదిస్తున్న సత్తెనపల్లి జర్నలిస్టులు

సత్తెనపల్లి: తప్పుడు కేసులు పెట్టడం సరికాదని జర్నలిస్టులు హితవు పలికారు. ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రమాదంలో పడేలా పాలకులు వ్యవహరిస్తున్న తీరుపై మండిపడుతున్నారు. అధికారం చేతిలో ఉందని 'సాక్షి'పై అక్కసు చూపిస్తూ వార్తలకు భయపడి పత్రిక గొంతు నొక్కాలని శతవిధాలా ప్రయత్నించడాన్ని ముక్త కంఠంతో ఖండించారు. పోలీసులతో ప్రభుత్వం చేయిస్తున్న దమనకాండపై మండి పడ్డారు. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డితోపాటు సాక్షి జర్నలిస్టులు కల్తీ మద్యంపై వరుస కథనాలు రాస్తూ ఉండడంతో తట్టుకోలేక అక్రమ కేసులు పెట్టడాన్ని తప్పుపడుతూ పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని జర్నలిస్టులు ఐక్యంగా శుక్రవారం రెవెన్యూ డివిజనల్ అధికారి జి.వి.రమణాకాంతరెడ్డికి వినతిపత్రం అందించారు. ఆర్డీఓ కార్యాలయం ఎదుట నినదించి మీడియాతో మాట్లాడారు. కొంతకాలంగా 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డి, సాక్షి జర్నలిస్టులను పోలీసులు పదేపదే విచారణ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇలాంటి చర్యలు సరికాదని ఖండించారు.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లా!

ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్ సైదా మాట్లాడుతూ రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడానికి సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి, జర్నలిస్టులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోందన్నారు. జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. పత్రికల్లో వ్యతిరేక వార్తలు వస్తే సద్విమర్శలుగా స్వీకరించాలని, ఎడిటర్ ధనంజయరెడ్డిపై అక్రమ విచారణ సరికాదని హితవు పలికారు. జర్నలిస్టులు పార్టీలకు అతీతంగా పనిచేస్తారని అలాంటి వారి పై అక్రమ కేసులు నమోదు చేయడం, విచారణ పేరుతో వేధించడం మంచిది కాదన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన పోలీసులు పక్షపాతంగా వ్యవహరించడం, అధికార పార్టీ నేతల కుట్రలో భాగస్వాములు కావడం సరికాదని హితవు పలికారు.

కక్ష సాధింపు వద్దు

సాక్షి సత్తెనపల్లి ఆర్సీ ఇన్‌చార్జ్ విప్పర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు వాస్తవాలను తెలిపే జర్నలిస్టులపై కక్ష సాధించడం తగదన్నారు. 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డిపై, జర్నలిస్టులపై పోలీస్ శాఖ వ్యవహరిస్తున్న తీరు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా సాగుతోందన్నారు. అక్రమ కేసులు పెట్టి గొంతు నొక్కేయాలనుకోవడం సరికాదని, ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. లేకుంటే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు మారూరి లింగారెడ్డి, షేక్ జిలాని, షేక్ బాజీ, మునగా వెంకటేశ్వరరావు, అంకాళ్ల నాగరాజు, అడబాల నాగేశ్వరరావు, తోట రమేష్, షేక్ ఖలీల్, ఎం.శ్రీనాథ్, తుమ్మలచెరువు హను మంతురావు, ఆట్లూరి జ్యోతి, సతీష్, కోడె శ్రీనివాసరావు, గంటా మహేష్, దివ్వెల సతీష్, తదితరులు ఉన్నారు.

పచ్చదనం పెంపొందించాలి

ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి



శిక్షణలో మాట్లాడుతున్న సత్తెనపల్లి ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతతో కూడిన పచ్చదనం పెంపొందించాలని సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 14 నుంచి శుక్రవారం వరకు నాలుగు రోజులపాటు స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో 5 అయిన పరిశుభ్రత పచ్చదనంపై మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులు, డ్వాక్రా వీవోఏలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఒక రోజు పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ సక్రమంగా సాగాలన్నారు. పాలిథిన్ వ్యర్థాల నిర్వహణ సజావుగా చేయాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో జరిగే అన్ని కార్యక్రమాలు, ఘన వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛరథం, హరితరాయబారుల హక్కులు, అవకాశాలు, గృహ స్థాయిలో తడి, పొడి చెత్తలను వేరు చేసే ప్రక్రియ, బిన్‌బ్యాగ్ విధానం, సంపద తయారీ కేంద్రంలో వర్మి కంపోస్టు తయారీ విధానం, పొడి చెత్తను బేళ్లుగా కట్టి అమ్మే విధానంపై అవగాహన కల్పించామన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన, నివారణ చర్యలు, తాగునీటి సక్రమ నిర్వహణ పద్ధతులు తదితర అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించినట్లు ఆయన వెల్లడించారు. శిక్షణ కార్యక్రమానికి మాస్టర్ ఆఫ్ ట్రైనర్లుగా డెప్యూటీ ఎంపీడీవో షేక్ అజీజుర్ రెహమాన్, పంచాయతీ కార్యదర్శులు కుంభా వెంకటేశ్వర్లు, కాల్వపల్లి అంజిరెడ్డి, చిలుకూరి కృష్ణప్రసాద్, చెల్లంచర్ల శ్రీనివాసరావు వ్యవహరించారు. శిక్షణలో ఏపీఎం ఎం.సమాధానం, జూనియర్ అసిస్టెంట్ విజయ్ సుందర్‌దాస్, డిజిటల్ అసిస్టెంట్లు శివశంకర్, రాకేష్, లక్ష్మణ్, సంపత్, కాశయ్య, సాల్మన్, తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సభ్యులు పరిశుభ్రతపై దృష్టిపెట్టాలి

రాజుపాలెం: డ్వాక్రా మహిళలు పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా సభ్యులకు పరిశుభ్రతపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ పగడాల ముక్కంటి, ఎంఈవో నరసింహారావు, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, వెలుగు ఏపీఎం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ చేద్దాం.. ప్రాణం పోద్దాం

ఏరియా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణ్‌రావు



సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలలో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లక్ష్మణ్‌రావు

సత్తెనపల్లి: ప్రస్తుత కాలంలో పిల్లల నుంచి వృద్ధుల వరకు గుండెపోటు సమస్య ఎదుర్కొంటున్నారని సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణ్ రావు అన్నారు. ఈ నేపథ్యంలో వైద్యశాఖ బాధితుల ప్రాణాలను రక్షించడానికి కార్డియో పల్మనరీ రీసస్కిటేషన్(సీపీఆర్) విధానంపై ఈనెల 13 నుంచి చేపట్టిన అవగాహన శుక్రవారంతో ముగిసింది. పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించిన అవగాహనలో ఆయన మాట్లాడుతూ నిత్యం వ్యాయామం లేకపోవడం, రోజువారీ ఆహారంలో తేడాలు, జంక్ ఫుడ్ తినడంతో రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయి రక్త సరఫరాను అడ్డుకోవడంతో గుండెపోటు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. సీపీఆర్ చేయడానికి వైద్యులే అవసరం లేదని, అవగాహన ఉన్న వారు ఎవరైనా చేయవచ్చన్నారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఒక్కసారిగా పడిపోతుంటారని, గుండె పని చేయకపోవడంతో ఇలా జరుగుతుంటుందన్నారు. నిమిషాల వ్యవధిలో నిర్దేశించిన ప్రకారం బాధితుడి ఛాతీపై రెండు అరచేతులు ఒకదానిపై ఒకటి ఉంచి హృదయ స్పందన తిరిగి ప్రారంభమయ్యేలా నొక్కుతూ ఉంటే బతికే అవకాశాలు ఉన్నాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక వైద్యసాయం ఎలా అందించాలి? అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యులు గిరిరాజు,కృష్ణమూర్తి, హెడ్ నర్సులు, నర్సింగ్ విద్యార్థులు, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.



సీపీఆర్ చేసే విధానాన్ని చూపిస్తున్న వైద్యాధికారులు

బాలికలందరూ సీపీఆర్ తెలుసుకోవాలి

క్రోసూరు: అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడే సీపీఆర్ పద్ధతి బాలికలు తెలుకోవాలని పీహెచ్‌సీ ఆరోగ్యవిస్తరణాధికారి శిఖాకాంసన్ అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ వసతిగృహం, మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాలను శుక్రవారం ఆయన సందర్శించి వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలికలకు సీపీఆర్ ఏ విధంగా చేయాలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కూచిపూడి రుసితో కలిసి చేసి చూపించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ చిలకా ఇందిరా ప్రియదర్శిని, హెల్త్ సూపర్‌వైజర్ శివుడు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

- రైల్వేస్టేషన్ రోడ్డులో స్టేడియం వద్ద దుకాణాలు
- సత్తెనపల్లి ఆర్డీఓ రమణాకాంతరెడ్డి



స్టేడియం ఆవరణలో తాత్కాలిక దుకాణాలకు స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీఓ రమణాకాంతరెడ్డి

సత్తెనపల్లి: అనుమతుల్లేకుండా దీపావళి బాణసంచా విక్రయిస్తే చర్యలు తప్పవని సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి జీవీ రమణాకాంతరెడ్డి హెచ్చరించారు. దీపావళి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్డులో తారక రామాసాగర్ ఎదురుగా ఉన్న స్టేడియం ఆవరణలో శుక్రవారం బాణసంచా తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, అగ్నిమాపక అధికారులతో కలిసి దుకాణాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాణసంచా సామగ్రి దుకాణదారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు. నివాస గృహాలు, స్కూల్స్, పెట్రోల్ బంకులకు సమీపంలో అనుమతులకు విరుద్ధంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. బాణసంచా తాత్కాలిక దుకాణాలకు స్టేడియం సమీపంలో స్థలాన్ని నిర్దేశించామని, ప్రతి దుకాణంలో అగ్ని నిరోధక సామగ్రి అందుబాటులో ఉంచాలన్నారు. నీరు, ఇసుక, బిందెలు తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. లైసెన్సు ప్రకారం మాత్రమే పరిమితి పరిమాణంలో మందుగుండు నిల్వలు ఉంచాలని చెప్పారు. రాత్రి 10 గంటల తర్వాత విక్రయాలు చేయవద్దన్నారు. అగ్నిమాపక అధికారులు ట్యాంకర్లు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. పార్కింగ్‌కు ఓవైపు స్థలాన్ని కేటాయించామన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో దీపావళిని జరుపుకోవాలని, దుకాణ యజమానులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఆయనతోపాటు తహసీల్దార్ కె.శ్రీనివాసచక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనంద్ కుమార్, పట్టణ సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు, సత్తెనపల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బోస్‌బాబు, అగ్నిమాపక అధికారులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

క్రోసూరు: అనుమతి, సరైన భద్రతా ప్రమాణాలు లేకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయకూడదని క్రోసూరు ఎస్‌ఐ రవిబాబు తెలిపారు.

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో చిరు వ్యాపారులు దీపావళి మందులను విక్రయించుకోవడానికి అనుమతి కోసం శనివారం సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సరోజ శుక్రవారం తెలిపారు.

ముప్పాళ్ళ: బాణసంచా దుకాణాల నిర్వహణకు ఆర్డీవో అనుమతి తప్పనిసరిగా ఉండాలని తహసీల్దార్ నగేష్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ దుకాణాలు నిర్వహించుకోవాలంటే ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని, అనుమతి పొందాల్సి ఉందన్నారు.

సత్తెనపల్లి పీఎం శ్రీ కేంద్రియ విద్యాలయానికి ఉత్తమ పాఠశాల అవార్డు



ఉపాధ్యాయులతో సహాయ కమిషనర్ ఇజ్రాయిల్, హెచ్ఎం జగదీష్ కుమార్ గుప్తా

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి పీఎం శ్రీ కేంద్రియ విద్యాలయానికి ఉత్తమ పాఠశాల అవార్డు వరించింది. సత్తెనపల్లి పీఎం శ్రీ కేంద్రియ విద్యాలయం-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి అధికారులు శుక్రవారం వార్షిక విద్యాతనిఖీ నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన సహాయ కమిషనర్ ఏఏ ఇజ్రాయిల్ అధ్యక్షత వహించారు. ఆయనతోపాటు సంబంధిత అధికారులు తనిఖీలకు హాజరయ్యారు. కమిటీ సభ్యులు విద్యా కార్యక్రమాలు, సహ పాఠ్య కార్యకలాపాలు, భవనం మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, అలంకరణ, విద్యార్థి–ఉపాధ్యాయ పరస్పర సంబంధాలు వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించారు. కమిటీ సభ్యులు తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, కళా విభాగం మొదలైన అన్ని విభాగాల్లో శ్రద్ధ, సమర్థ నిర్వహణ గమనించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను ప్రశంసించారు. విద్యార్థులు చూపిన కళలు, సంగీతం, క్రీడలు, ప్రాజెక్టు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడు జగదీష్‌కుమార్ గుప్తా తమ నాయకత్వ నైపుణ్యం, దూరదృష్టి, అంకితభావంతో పాఠశాల భవనాన్ని ఆకర్షణీయంగా, క్రమ బద్ధంగా తీర్చిదిద్దడమే కాకుండా విద్యావాతావరణం, క్రమశిక్షణ, విద్యార్థుల ప్రతిభతో ఈ పాఠశాల మొత్తం ఈ ప్రాంతానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇక్కడ కార్యకలాపాలు అత్యున్నత స్థాయిలో ఉన్నాయన్నారు. తనిఖీ అనంతరం పాఠశాల విశిష్ట విజయాలను గుర్తిస్తూ ప్రధానోపాధ్యాయుడు జగదీష్ కుమార్ గుప్తాకు 'అరిస్' సంస్థ ప్రదానం చేసిన ఎక్సలెంట్ స్కూల్ అవార్డును అందించారు. గుంటూరులో నిర్వహించిన హిందీ పోటీ పరీక్షల్లో పాఠశాల మొదటి స్థానం పొందడం ఎంతో అభినందనీయమన్నారు. సమాజసేవ, సామాజిక బాధ్యతల కోసం పాఠశాలకు సోషల్ సర్వీస్ సర్టిఫికెట్ కూడా అందించారు. ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయుడు జగదీష్‌కుమార్‌గుప్తా కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ ఇచ్చిన సూచనలు, ఆదేశాలను తక్షణమే అమలు పరుస్తామన్నారు. పాఠశాల నాణ్యత, క్రమశిక్షణ కార్యక్రమాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. ముందుగా పాఠశాల వార్షిక పత్రిక 'గుంజన్'ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

పత్తిలో అధిక దిగుబడులు సాధించాలి

దాచేపల్లి: పత్తి పంటలో అధిక దిగుబడులు సాధించాలని ఆచార్య ఎన్జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి.శివనారాయణ అన్నారు. దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పల్నాడు జిల్లాలో నిర్వహిస్తున్న పత్తిలో అంతర సాగు పద్ధతిని శుక్రవారం ఆయన పరిశీలించారు. దాచేపల్లిలో 50 ఎకరాల పత్తి పంట సాగును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అంతర సాగు పద్ధతిని పాటించడం వలన ఎకరానికి సుమారు 14 వేల మొక్కలు పడతాయని, మొక్క 45–50 రోజుల వయసులో, వాతావరణ అనుకూలతని బట్టి మెపిక్వాట్ క్లోరైడ్‌ని (చమత్కార) ఎకరానికి 150 మిల్లీలీటర్లు ఒకసారి, 65–70 రోజుల పంట కాలంలో ఎకరానికి 200 మిల్లీలీటర్లు ఇంకోసారి స్ప్రే చేసుకోవాలని తెలిపారు. దీని వలన మొక్క ఎత్తుని తగ్గించి, కింది వరుస కాయలు బాగా లావుగా రావడమే కాకుండా కాయ ఒకేసారి పగిలి దిగుబడి 15 శాతం అధికంగా వస్తుందని వివరించారు. పత్తిని కుళ్లు నుంచి కాపాడి, 2–3 తీతలలో పంట దిగుబడి వచ్చి గులాబి రంగు పురుగు నుంచి కాపాడవచ్చని డాక్టర్ శివనారాయణ చెప్పారు. ఈ పద్ధతిలో పత్తి తొందరగా కోతకు వస్తుందని, దీని వలన రెండవ పంట విత్తుకోవడానికి అనుకూలంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రెండో పంటగా పత్తి తరవాత వరి, శనగ పంటలను వేసుకోవచ్చన్నారు.

- నాదెండ్ల: గణపవరంలో ఆంజనేయ ఉపాసకులు అచల దాసునాయన సద్గురు మఠంలో శుక్రవారం మఠాధిపతుల ప్రవచనాల కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా గుంటూరు బ్రహ్మం మఠం పీఠాధిపతి యానాదుల సత్యనారాయణ, చిరుమామిళ్ళ అమ్మవారి పీఠం పీఠాధిపతి భక్తానందస్వామి, వేజెండ్ల పేరిరెడ్డి పీఠాధిపతి జగన్నాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.